# ట్యూషన్ మేష్టారు

వాళ్ళు తా రెండు పెద్ద దిష్టిబొమ్మల్ని తగులబెడ్తున్నారు. వాటి మీద పెట్రోలు పోసి అగ్గిపుల్ల గీసి అంటించారు. గుప్పుమని పెద్ద మంటలు లేచాయి. చుట్టూఉన్నవాళ్ళంతా పెద్దపెట్టున హర్షధ్వానాలు చేశారు చప్పట్లు కొట్టారు. విజిల్స్ ఊదారు. గంతులు వేశారు. ట్విస్ట్ డాన్సులు చేశారు, వెర్రిగా అరిచారు. "నిక్సన్, కీసింగర్ ముర్దాబాద్" అన్న కేకలు ఆకాశాన్ని అంటాయి.

కొంచెం దూరంలో ఉండి ఇదంతా చూస్తున్న నాకూ్కడా ఆ రెండు దిష్టిబొమ్మలు అలాతగులబడిపోతోంటే యేదో చెప్పలేని ఆనందం కల్గింది. ఆ రెండు బొమ్మలు ఎవరో నిక్సన్, కీసింగర్లవట. వాళ్ళెవరో నాకంతగా తెలియదు. కాని నాకా దిష్టిబొమ్మల్లో ఒకటి మా ట్యూషన్ మేష్టారు రామచంద్రయ్య, ఇంకొకటి ఆయన భార్యరాములమ్మ బొమ్మల్లా కనిపించాయి. ఈ భావం మనస్సులో మెలగ్గానే నాకూ్కడా వాళ్ళలాగే విజిల్లూదాలనిపించింది. ట్విస్ట్ డాన్సు చెయ్యాలనిపించింది. పిల్లి మొగ్గలు వెయ్యాలనిపించింది. ఎక్కడికో ఎగిరిపోవాలని పించింది.

## 2

మా ట్యూషన్ మేష్టారు రామచంద్రయ్య ఆ ఊర్లో చాలా పేరున్నవాడు. బాగా డబ్బున్నవాడు కూడా. (అఫ్కోర్సు బాగా డబ్బున్న వాడికే పేరుంటుందని నాకూ్కడా తెలుసు) ఆయన దగ్గరకు బాగా పేరున్న డాక్టరు దగ్గరకు పేషెంట్స్ ఎలా వస్తారో ట్యూషన్ చదవటానికి విద్యా

ర్థులు అలా వస్తారు. పొద్దున ఒక బ్యాచ్,సాయంకాలం ఒక బ్యాచ్, రాత్రి ఒక బ్యాచ్—ఇలా మొత్తం 69, 70 మంది రామచంద్రయ్య దగ్గర ట్యూషన్ చదువుతారు.

రామచంద్రయ్య ఆ ఊరి హైస్కూల్లో టీచర్. ఆయన పూర్వం ఎప్పుడో మెట్రిక్ పాసై టీచరు ఉద్యోగంలో చేరాడు. కాని ఇప్పుడు ఆయన పేరు పక్కన చాలా డిగ్రీలు చేరాయి. ఎం. ఎ. బి. ఇడి. యల్. యల్. బి. లాంటివి. ఆయన పదిహేనేళ్ళ సర్వీసులో ఈ డిగ్రీలతోపాటు ఆ ఊళ్లో నాలుగు ఇండ్లుకూడా సంపాదించాడు. ఆయన బ్యాంక్ బాలెన్స్ 30-50 వేలమధ్య ఉండొచ్చని కొందరు, లేదు లక్షలో పడిందని కొందరు చెప్పుకుంటారు.

రామచంద్రయ్య నిజానికి లెక్కల మాష్టారు. స్కూల్లో గవర్నమెంట్ వాళ్లు ఇస్తున్న జీతానికి వారు లెక్కలు మాత్రమే చెబుతారు. కాని ఆయన దగ్గరకు ట్యూషన్ చదవటానికి వెళ్ళిన వాళ్లకు మాత్రం ఆయన చెప్పలేని సబ్జెక్ట్ లేదు. చరిత్ర, భూగోళం, సివిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రి, బాటనీ, ఇంగ్లిషు, తెలుగు, హిందీలాంటి సబ్జెక్ట్స్ అన్నీ ఆయన చెప్పటానికి ఒప్పుకుంటాడు.

నిజానికి రామచంద్రయ్యగారు యే సబ్జెక్ట్ కూడా చెప్పడు. పాఠాలు స్కూల్లోగాని, ఇంట్లోగాని, చెప్పే ఓపిక ఆయనకేనాడో నశించింది. ట్యూషన్ చదువడానికి వచ్చిన వాడి దగ్గర మొదలే యాభై రూపాయలు తీసుకుంటాడు. వాడి పేరు రిజిష్టరులో రాసుకుంటాడు. అంతే, పరీక్షలు వచ్చేదాకా ఇక వాడి మొఖం చూడడు.

కాని రామచంద్రయ్యగారు చెప్పేదంతా పరీక్షలనాడు చెబుతాడు. పరీక్షలు వారంరోజు లున్నాయనప్పట్నించి ఆయన తెగ బిజీ అయిపోతాడు. ఆయనకు పరీక్షల్లో రాబోయే ప్రశ్నలన్నీ మొదలే తెలుస్తాయి. కొంతమంది టీచర్లని పిలచి వాళ్లచూ కొంత ముట్టచెప్పి ఆన్సర్స్ రాయిస్తాడు. ఆ ఆన్సర్స్ని సైక్లోస్టయిల్ చేయిస్తాడు. ఆ ఆన్సర్స్ని తన వాళ్లంతా ఎక్కడున్నారో తెలుసుకొని వాళ్లకు జాగ్రత్తగా అందజేస్తాడు. కాబట్టి రామచంద్రయ్య దగ్గర ట్యూషన్ చదివిన వాళ్లలో ఎవరో అతి దురదృష్టవంతుడు తప్ప ఎవ్వడూ ఫెయిల్ కావటానికి అవకాశం లేదు.

అవసరమయితే ఆయన ఇంకా పైకిపోయి పేపర్లు దిద్దేవాళ్లను కలుసుకుని ఫస్టుక్లాస్ కావాలన్న వాళ్లకు ఫస్టుక్లాసు అందులో యే ర్యాంక్ కావాలంటే ఆ ర్యాంక్ తీసుకు రాగలడు. అయితే ఇదంతా జరగాలంటే డబ్బు-రామ చంద్రయ్య అడిగినంత డబ్బు ఇవ్వాలి.

రామచంద్రయ్యకు విద్యార్థుల్లో మంచి పలుకుబడి ఉంది. ఆయన చుట్టూ ఎప్పుడూ చాకుల్లాంటి కుర్రాళ్లు (చాకులతోసహా) తిరుగుతుంటారు స్టూడెంట్ యూనియన్ ప్రెసిడెంట్, సెక్రటరీ మొదలైన వాళ్లంతా ఆయన చెప్పుచేతల్లో మెదులుతుంటారు. స్కూల్లో విద్యార్థుల్లో యే గొడవ జరిగినా దాన్ని పరిష్కరించాలంటే రామచంద్రయ్యకే సాధ్య మౌతుంది. ఆయన ఇట్టే గొడవల్ని సృష్టించగలడు. ఇట్టే వాటిని పరి ష్కారం చెయ్యనూ గలడు. (గొడవల్నే కాదు, ఆయన ఉద్యమాల్ని కూడా సృష్టించగలడు. ఆమధ్య భారత దేశాన్నంతా ఊపేసిన ప్రత్యేక తెలంగాణా ఉద్యమాన్ని సృష్టించిన ప్రముఖుల్లో రామచంద్రయ్యగారొ కరు) కాబట్టి ఆయన పనిచేస్తున్న స్కూలు హెడ్ మాస్టర్‌కు రామ చంద్రయ్య సహాయ సహకారాలు లేందే ఒక్కరోజు కూడా గడవదు. రామచంద్రయ్యతో విరోధం తెచ్చుకున్న హెడ్ మాస్టరెవడూ ఆ ఊరి నుండి క్షేమంగా వెళ్లలేదు.

రెండు మూడేళ్ల క్రితం రామచంద్రయ్యకు ఆ టౌన్ నుండి ఎక్కడికో దూర ప్రాంతాలకు ట్రాన్స్‌ఫర్ అయ్యిందట.ఆ ట్రాన్స్‌ఫర్‌కు కారణం ఆయన ట్యూషన్ మీద విపరీతంగా డబ్బు గడిస్తున్నాడని ఎవరో పై అధికారులకు ఫిర్యాదు చెయ్యటమేనట. ఆయనకు ట్రాన్స్‌ఫర్ అయి నట్టు తెలిసిందో లేదో ఆ స్కూలు విద్యార్థులు బ్రహ్మాండమైన స్ట్రయిక్ మొదలెట్టారు. ఆ స్కూలు, ఆ ఊరు మొత్తం దగ్ధమైపోయే ప్రమాదం యేర్పడింది రామచంద్రయ్యమీద ఫిర్యాదు చేసిన వాళ్లెవరోకాదు-అప్పట్లో కొత్తగావచ్చిన హెడ్‌మాస్టరేనని తెలిసి విద్యార్థులంతా అతని ఇంటిమీద పడ్డారు, చితకబాదారు. ఇంట్లోఉన్న బల్లలు, కుర్చీలు,రేడియో,గడియారం మొదలైన వాటినన్నింటిని నాశనం చేశారు. వెంటనే ఆ తాలూకా, ఆజిల్లా నాయకులంతా కదిలారు. ముఖ్యమంత్రి దాకా వెళ్ళి రామచంద్రయ్య ట్రాన్స్‌ఫర్‌ను కాన్సిల్ చేయించు కొచ్చారు. కొత్తగా వచ్చిన హెడ్

మాష్టర్ వెంటనే ట్రాన్స్‌ఫర్ చేయించుకొని వెళ్ళి పోయాడు. అప్పటి నుంచి రామచంద్రయ్య జోలికి వెళ్లడమంటే నిప్పుతో చెలగాటమేనని ఆ జిల్లా అంతా తెలిసిపోయింది.

# 3

భూమిచుట్టూ చంద్రుడు తిరగటం ఎంత సహజంగా జరిగి పోతున్నదో నేను రామచంద్రయ్యగారి దగ్గరకు ట్యూషన్ చదవటానికి వెళ్లటం అంత సహజంగా జరిగిపోయింది.

ఏవో కొన్ని దొంగమార్గాలు అనుసరిస్తేతప్ప నాకు మామూలుగా చదువురాదని మా నాన్నగారికి స్థిరమైన అభిప్రాయం యేర్పడింది. (ఆయన అనుభవం అట్టాంటిది. మా నాన్న చిన్నపాటి రాజకీయ నాయ కుడు) దీనికి తోడు ఆయనకు చిన్ననాటినుండి ఇంకో అభిప్రాయంకూడా వుంది. అదేమిటంటే లక్ష్మి, సరస్వతులు ఒకచోట ఎప్పుడూ వుండరని ఆయనకు చిన్నప్పుడే ఎవరో చెప్పారట. అది ఆయన తల్లోకి బాగా ఎక్కింది. చిన్ననాడు తనకికూడా ఏ మాత్రం చదువు అబ్బకపోవటానికి తను బాగా డబ్బున్న వాళ్ల ఇంట్లో పుట్టడమేనని మా నాన్నగారు ఇప్ప టికీ సరదాగా చెప్తుంటారు. కాబట్టి తనలాగే నాక్కూడా చదువురాదని మా నాన్నగారు నేను పుట్టకముందే ఒక అభిప్రాయం యేర్పరచు కున్నారు.

నేను పదో తరగతిలో ప్రవేశించిన క్షణంనుండి మా నాన్నగారికి నా చదువుమీద విపరీతమైన శ్రద్ధ కల్గింది. నాకు ట్యూషన్ చెప్పించాలన్న నిర్ణయం తీసుకున్నారు. రామచంద్రయ్యగారి కీర్తి ప్రతిష్ఠలు మా నాన్న దాకా చేరాయి. రామచంద్రయ్య ఎవరూ, ఏమిటి అని ఆరాతీసి ఆయన మాకు దూరపు బంధువౌతాడని తెలిసి ఎగిరి గంతేశారు. ఇంకేముంది వెంటనే వెళ్ళి రామచంద్రయ్యను కలుసుకున్నారు. మొదట బంధుత్వం సంగతి తెల్సుకొని తర్వాత నా విషయంలో పడ్డారు.

"ఎవరీ కుర్రాడు" నాకేసి చూస్తూ రామచంద్రయ్య అడిగాడు.

"మా వాడే. మీ స్కూల్లోనే చదువుతున్నాడు" అన్నారు మా నాన్న.

"అరే! అలాగా! ఏరా, ఏ క్లాసులో ఉన్నావు" అన్నాడు రామచంద్రయ్య.

"సెంత్ క్లాసండి" అన్నాను.

"ఏమోనండి రామచంద్రయ్యగారూ—వీడు నాకో పెద్ద సమస్యయిపోయాడు. చదువులేదు పాడు లేదు. నెల నెలా డబ్బు పంపిస్తుంటే ఈ ఊర్నిండా అడ్డగాడిదలా తిరుగుతున్నాడు. వీడ్ని కొంచెం అదుపులో పెట్టేవాళ్ళెవరూ లేరు" అన్నాడు మా నాన్న

మా నాన్న చెప్పింది పచ్చి అబద్ధం. నిజానికి నేనెప్పుడూ ఆయనకు సమస్య కాలేదు. నేను బుద్ధిగానే చదువుకుంటున్నాను. ట్యూషన్, గీషన్ యేమీ లేకుండానే నేను ఎస్. ఎస్. సి. పరీక్ష ప్యాసు కాగలను కాని నేను ట్యూషను చదవకుండా ఎస్. ఎస్. సి. ప్యాసు కాగలనని ఆయన్ను ఒప్పించటం అంత సులువైన పని కాదు.

"వీడు రోజు రోజుకు చెడిపోతున్నాడు. వీడికి చదువొచ్చే మార్గం యేమన్నా ఉందా?" అన్నారు మళ్ళా మా నాన్న.

"గవర్నమెంట్ స్కూళ్ళల్లో ఎక్కడయినా చదువులొస్తయ్యా! గవర్నమెంట్ హాస్పిటల్లో డాక్టర్లు పేషెంట్స్‌నిచూస్తారా? ఇంటికెడితే చూస్తారు. చదువు కూడా అంతే. ఎవరైనా మంచి ట్యూషన్ మేస్టార్ని చూసి ట్యూషన్ చెప్పించండి" అన్నాడు రామచంద్రయ్య. మా నాన్నగారు ఈ మాట కోసమే ఎదురు చూస్తున్నారు.

"ఎవరో ఎందుకు. మీ దగ్గరే చదువుతాడు. అంతేకాదు. ఇప్పట్నుంచి వాడి బాధ్యతంతా మీదే. ఈ టౌన్‌లో వాడిని అదుపులో పెట్టే వాళ్ళెవరూ లేక బొత్తిగా చెడిపోతున్నాడు. (నేను చెడిపోతున్నానని, తను నన్నేదో బాగు చేస్తున్నానని అనటం, అనుకోవటం మా నాన్నకు చాలా సరదా, బహుశః ఏ నాన్నైనా ఇంతేనేమో!) ఇకనుండి నెలనెలా పంపించే డబ్బు కూడా మీకే పంపిస్తాను. వాడికి యేం కావాలో కనుక్కొని మీరే వాడికి డబ్బు ఇస్తుండండి" అన్నారు మా నాన్న. ఆ క్షణం నుంచి మా నాన్నను యేం చేసినా పాపం లేదనిపించింది.

"ఓ దానికేం! వాడినో దారిలో పడేసే భారం నాది. వాడిని గురించి మీరేమీ దిగులు పెట్టుకోకండి" వెంటనే అన్నాడు రామచంద్రయ్య.

కాని ఆనాటినుంచి నా బతుక్కి దిగులే మిగిలింది. ఆ నాటినుండి నేను మా నాన్న, రామచంద్రయ్య కలిసి పన్నిన ఉచ్చులో చిక్కిపోయి గిలగిలా తన్నుకుంటున్నాను. ఆ నాటినుండి నా స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు మంట గలిశాయి.

అసలు రామచంద్రయ్య లెక్కే అది.

పై క్లాసులో ఉండే డబ్బున్నవాళ్ళ కుర్రాళ్లను చూస్తాడు. "ఒరే నీకు పొట్ట చీలిస్తే అక్షరంముక్క లేదుకదా- ఈ సంవత్సరం బోర్డు పరీక్ష కదా! ఎలా పాసౌతాననుకుంటున్నావురా. పో వెధవ మీ నాన్ననడిగి ఓ యాభై రూపాయలు తీసికొని నా దగ్గర ట్యూషన్‌కు రా పో!"అంటాడు.

రామచంద్రయ్య ట్యూషన్ చదవమని అలా హింటిచ్చాకకూడా యే స్టూడెంటైనా ఆయన దగ్గరకు ట్యూషన్ చదవడానికి వెళ్ళలేదనుకోండి ఇక వాడి పని క్లోజ్. వాడిని నానా రకాలుగా హింసిస్తాడు. ఏవో ప్రశ్నలడిగి వాడిని క్లాసులో బూతులు తిట్టాడు. వాడికి అటెండెన్సు లేదని హాల్ టికెట్ రాకుండా చేస్తాడు. క్లాసులో గొడవ చేస్తున్నాడని హెడ్ మాస్టర్‌కు రిపోర్టు యిచ్చి వాడిని స్కూలునుండి సస్పెండ్ చేయిస్తాడు కాబట్టి వాడెంత బ్రిలియెంట్ స్టూడెంటైనా సరే రామచంద్రయ్య దగ్గర ట్యూషన్ చదివి తీరాల్సిందే.

## 4

మా నాన్న నన్ను రామచంద్రయ్యకు అప్పగించిపోయిన క్షణం నుంచి నాకు చదువుమీద శ్రద్ధ నశించింది. ఇది వరకు రోజు పాఠం రోజు చదువుకునే అలవాటు నాకుండేది. పరీక్షలంటే భయం ఉండేది. బాగా చదువుకుంటే తప్ప ప్యాసు కాలేనన్న భయం నన్నెప్పుడూ వెంటాడుతుండేది. ఇప్పుడా భయం పోయింది. అంతా రామచంద్రయ్య చూసుకుంటాడులే అని పుస్తకాలకేసి చూడటం మానేశాను. నేనిప్పుడు ఎంత కష్టపడి చదివినా రేపు ప్యాసైతే మా నాన్న నేను కష్టపడి చదివి

ప్రాసయ్యానని కల్లో కూడా ఒప్పుకోడు. రామచంద్రయ్య ప్రాసు చేయించాడంటాడు. అటువంటప్పుడు నేనెందుకు చదవాలి?

చదివినా, చదవకపోయినా రోజూ పదిసార్లు రామచంద్రయ్య ఇంటి చుట్టూ తిరగటం నాకు తప్పలేదు. నేను వాళ్ళింటికి వెళ్ళగానే రామచంద్రయ్య భార్య నాకేదో పని చెప్పేది. "నాయనా! బజారుకెళ్ళి కూర గాయలు తెచ్చిపెట్టు" అని ఓ సంచి చేతికిస్తుంది. "నాయనా! కొంచెం నీళ్లు చేదిపెట్టు" అని బొక్కెన చేతికిచ్చేది. నీళ్లు చేదటం అయిపోగానే ఓ చంటి పిల్లాడ్ని తెచ్చి "గుక్కపట్టి యేడుస్తున్నాడు—కాసేపు ఎత్తుకో నాయనా అనేది (వాడ్ని ఎత్తుకోగానే నా మీద మూత్రం చేసి నా బట్టలు పాడుచేసేవాడు). ఇలా రాములమ్మ చెప్పే పనులకు అంతుండేది కాదు ఎంతోమంది ట్యూషన్‌కు వస్తున్నా రాములమ్మ నాకే అన్ని పనులు చెప్పటంలోని అంతరార్థం త్వరలోనే తెలిసింది. నేను వాళ్ళకుబంధువు నౌతాను. అందుకే నన్ను రాబందులా పట్టి పీడిస్తున్నారు.

అన్నిటికంటే నన్ను పీడించిన సమస్య - నాకు డబ్బు కావాల్సి వచ్చినప్పుడల్లా రామచంద్రయ్యను అడగాల్సి వచ్చేది, డబ్బు కోసం ఆయన దగ్గరకు వెళ్ళినప్పుడల్లా ఆయన స్వంతంగా ఇస్తున్నట్టు లక్ష ప్రశ్నలు వేసేవాడు.

"ఎందుకు డబ్బిప్పుడు? మొన్ననేగా తీసుకున్నావు, ఇలా ఖర్చు పెట్తోంటే డబ్బు ఎక్కణ్నుంచి వస్తుందనుకుంటున్నావు. సంపాదించే తెలివి లేదుగాని ఖర్చుపెట్టడానికి మాత్రం తయారు. యేమిటో! ఈ కాలపు కుర్రకుంకలంతా ఇలాగే తయారౌతున్నారు. ఎందుకు నీకు డబ్బిప్పుడు?"

"రూము రెంట్ కట్టాలండి—హోటలు వాడికివ్వాలండి—ఇంకా ఇంకా—"

"అన్నీ అబద్ధాలు ఈ డబ్బు తీసికెళ్ళి నువ్వూ, నీ స్నేహితులు కలసి సినిమాకెడ్తారు. హోటల్లో బాగా మెక్కుతారు—అంతే కదురా?"

"అబ్బే లేదండి—"

"ఫో: రోజు రోజుకు—నాశనమైపోతున్నావు—ఏదో పెద్ద మనిషి చెప్పాడనిగాని నువ్వేమైపోతే నాకెందుకురా అంటూ డబ్బును నా మొహాన పడేసేవాడు.

మొదట డబ్బు అడిగినప్పుడల్లా ఆయనకు నిజమే చెప్పేవాడిని. కాని చెప్పేదంతా "అబద్ధం, అబద్ధం" అంటుండటంతో ఇక నిజం చెప్పి లాభం లేదనిపించింది. అబద్ధాలు చెప్పడం మొదలెట్టాను. అంతేకాదు నేను ట్యూషన్ చదవటం మొదలెట్టినప్పట్నుంచి నాకు ఇదివరకు లేని అలవాట్లు చాలా వచ్చాయి. రామచంద్రయ్య ఇంట్లో యమయాతన అను భవించి బయట పడగానే నాకు ఏదో చేసెయ్యాలనిపించేది. మా క్లాస్ మేట్స్ చాలామంది గుమిగూడే సెంటర్‌కు వెళ్ళేవాడిని. వాళ్లంతా కేడీ లని, ఆడపిల్లల్ని యేడిపిస్తారని సిగరెట్లు తాగుతారని, సినిమాలు చూస్తారని ఇదివరకు వాళ్ళ దగ్గరకు వెళ్లేవాడిని కాదు. కాని నేను రామచంద్రయ్య ఉచ్చులో చిక్కినప్పట్నుంచి వాళ్లను చూస్తే "వీళ్ళు ఎంత అదృష్ట వంతులురా బాబు వీళ్లకు స్వేచ్ఛ ఉంది. వీళ్ల యేం చెయ్యదల్చుకుంటే అది చేసేస్తారు. నేనెందుకు వీళ్లలో ఉండకూడదు!'' అనిపించేది. నేను కూడా వాళ్లతో చేరిపోయాను. వాళ్లలాగే సిగరెట్స్ తాగటం నేర్చు కున్నాను, రామచంద్రయ్యకు ఆయన కిష్టమైన నాలుగు అబద్ధాలు చెప్పి నాలుగు తిట్లుతిని డబ్బు తెచ్చుకొని టైట్‌ప్యాంట్లు కుట్టించుకున్నాను. వాళ్ళలాగే సినిమాలకు తిరగటం, సెంటర్లో నిల్చొని వచ్చేపోయే ఆడ పిల్లల్ని యేడ్పించటం మొదలైనవన్నీ అలవర్చుకున్నాను.

## 5

ఆడపిల్లలంటే గుర్తొచ్చింది—మా ట్యూషన్ మేస్టారుకు ఐదుగురు ఆడపిల్లలు—(నలుగురు మొగపిల్లలు కూడా, అంతేకాదు—ఇప్పుడాయన భార్య కడుపుతో ఉంది.) ఐదుగుర్లో పెద్దవాళ్ళిద్దరికి పెళ్ళి అయింది. మూడో అమ్మాయి తొమ్మిదో తరగతి, నాల్గో అమ్మాయి ఆరో తరగతి ఐదో అమ్మాయి నాల్గో తరగతి చదువుతున్నారు.

ఆ తొమ్మిదో తరగతి చదువుతున్న అమ్మాయి—ఆ అమ్మాయి పేరు వనజ. ఎప్పుడయినా కల్లోకొస్తే కెవ్వున కేకేసి లేచి కూర్చుంటాను ఇక పగలు చూస్తే కడుపులో పేగులు బయట పడేంత దోకొస్తుంది. వాళ్ళింట్లో వున్నంతకాలం ఆ అమ్మాయిని ఎలా తప్పించుకోవాలా అని

ప్రయత్నించేవాడిని. కాని ఆ అమ్మాయి నేనెక్కడుంటే అక్కడకు వచ్చి నన్ను తినేలా చూస్తుండేది.

వనజను వర్ణించటానికి నాకు తెలిసిన తెలుగు మాటలు సరిపోవని పిస్తుంది, వనజ నల్లగా....బొగ్గుకంటె నల్లగా ఉంటుంది. ఎత్తుపళ్ళు, వడ్డిముక్కు, పెనంలాంటి ముఖం. చిన్న కళ్ళు. చీపురుపుల్లలాంటి శరీరం గాలికి కొట్టుకుపోతున్నట్టుగా విసురుగా నడిచేది. ఆ అమ్మాయి ఎప్పుడైనా నవ్వితే ఎలుగుబంటి నోరు తెరిచినట్లుగా ఉండేది. ఎందుకో ఆ అమ్మాయి నన్ను చూసినప్పుడల్లా వెకిలిగా నవ్వేది.

## 6

క్రమంగా నాస్నేహితులసంఖ్య పెరిగింది. అలవాట్లుపెరిగాయి. ఖర్చులు పెరిగాయి. మా నాన్న, ట్యూషన్ మేష్టారు అంటున్నట్లు నేనిప్పుడు పూర్తిగా "చెడిపోయాను".

ఎప్పుడైనా స్ట్రయికుల్లాంటివి వస్తే భలే ఉత్సాహంగా పాల్గొనే వాడిని. యేదన్నా పడగొట్టాలన్నా నాశనం చెయ్యాలన్నా, బస్సులకేసి రాళ్ళ విసరాలన్నా, భలే ఉత్సాహంగా ఉండేది. ఎందుకో లోకమంతా మా నాన్నలతో, మా ట్యూషన్ మేస్టార్లతో నిండి వున్నట్టనిపించేది.

క్రమంగా రామచంద్రయ్య ఇంటికి వెళ్ళటం తగ్గించాను. రాములమ్మ చెప్పే పనుల్ని ఏదో నెపంతో తప్పించుకోవటం నేర్చుకున్నాను. డబ్బు అవసరమయితే తప్ప రామచంద్రయ్యకు ఎదురుపడేవాడిని కాదు. డబ్బు అడిగినప్పుడల్లా నాలుగు తిట్టి ఇస్తుండేవాడు.

రామచంద్రయ్య దగ్గరనుండి సులభంగా డబ్బు రాబట్టటానికి ఈ మధ్య నేనో టెక్నిక్ కనిపెట్టాను;

నాకు డబ్బు కావలసినప్పుడల్లా డైరెక్టుగా రామచంద్రయ్యను అడక్కుండా రాములమ్మతో అడిగించటం. రామచంద్రయ్యలాగ ఆమె లక్ష ప్రశ్నలు వెయ్యదు. ఆమె నన్నెందుకోగాని కొంచెం ప్రేమగానేచూసేది. నేను డబ్బడగ్గానే ఆమె భర్త దగ్గరకెళ్ళి "వాళ్ళడబ్బు వాళ్ళకివ్వటానికేమి టండి. ఆ పిల్లవాడికికూడా ఏవో అవసరాలు, సరదాలు ఉంటాయి. ఇచ్చే

యండి" అనేది. రామచంద్రయ్య భార్యమాటకు విలువిస్తాడు.ఆమె డబ్బు తెచ్చి నాకిచ్చేది.

ఈ మధ్య నేనొక విషయం కనిపెట్టాను. రామచంద్రయ్య ఇంట్లో నాకు రోజురోజుకు ప్రాముఖ్యత పెరుగుతోంది. మొదట్లోలాగ రాములమ్మ నాకు అడ్డమైనపనులన్నీ చెప్పడంలేదు. వెళ్ళినప్పుడల్లా టిఫిన్ తినమనటం కాఫీ తాగమనటం, ఏమైనా పండుగవస్తే భోజనంకూడా అక్కడే చెయ్యమనటం జరుగుతుండేది. అయితే ఆ ఇంటికి వెళ్ళినప్పుడల్లా నాకు పరమ యిబ్బందిగా ఉండేది ఒక్కటే—అదే వనజ నాకు ఎదురుపడటం—ఆ అమ్మాయిని చూసినప్పుడల్లా నాకు స్త్రీజాతిమీదనే ఏవగింపు కలిగేది. అప్పుడప్పుడూ అనుకుంటుండేవాడిని; ఈ వనజనుకూడా భార్యగా స్వీకరించే దురదృష్టవంతు డెవడో ఈ లోకంలో ఎక్కడో వుండి ఉంటాడని.

ఎస్.ఎస్.సి. పరీక్షలొచ్చాయి. పరీక్షలు రెండుమూడు రోజులున్నా యనగా మా ట్యూషన్ మేస్టారు తనదగ్గర ట్యూషన్ చదివే వాళ్ళందరినీ తనచుట్టూ కూర్చోబెట్టుకొని కొన్ని విషయాలు చెప్పాడు.

"పరీక్షలంటే మీరేమీ భయపడకండి. మీరు కూర్చున్న సీటు దగ్గరకు ఆన్సర్స్ వస్తాయి....వాటిని కొంచెం జాగ్రత్తగా ఆన్సర్ బుక్ మీదకు ఎక్కించండి. చూసికూడా తప్పులు రాయకండి. మిమ్మల్ని ఎవరూ ఏమీ అనరు. టీచర్స్‌తో నేను మొదలే చెప్పాను. కాని హెడ్‌మాస్టర్, బి.డి.ఓ. గాని ఎప్పుడన్నా వస్తే కాసేపు మూసెయ్యండి. తెల్సిందా?" అన్నాడు రామచంద్రయ్య.

అందరమూ తలూపాము.

ఆ తెల్లారి రామచంద్రయ్య కొన్ని ప్రశ్నలున్న కాగితాలు మాకిచ్చాడు.

వెధవల్లారా ఆ క్వశ్చన్స్ ఒకసారి చూసుకోండి. రేపురాబోయేవి ఇవే క్వశ్చన్స్. ఇవి చాలా రహస్యంగా ఉండాలి. మీకుతప్ప ఇంకఎవడికైనా తెలిశాయో మీడొక్క చించేస్తాను" అన్నాడు రామచంద్రయ్య.

అందరమూ ఆ క్వశ్చన్స్ ఉత్సాహంగా అందుకొన్నాము. కాస్సేపటికి వాటికి ఆన్సర్సుకూడా తయారుచేయించి మాకిచ్చాడు మా ట్యూషన్ మాస్టారు.

ఇదంతా చూశాక ఎన్నడూలేంది నాకూడా రామచంద్రయ్యమీద గౌరవంలాంటిది కల్గింది. ఎందుకంటె ఆయన మామూలు మానవ మాత్రుడు కాదనిపించింది. ఆయన నిజంగా దేవాంతకుడు. లేకపోతే పరీక్షల్లో రాబోయే ప్రశ్నల్ని రెండుమూడు రోజులుముందే తెలుసుకోవట మంటే మాటలా?

క్వశ్చన్ పేపర్స్ ఉన్న బండిల్స్ వారం ముందే హెడ్‌మాస్టర్ దగ్గర కొస్తాయట. రామచంద్రయ్య గారు హెడ్మాస్టర్‌ను నయానో్న భయానో్న వప్పించి బండిల్స్ విప్పుతారట. తర్వాత మామూలుగా సీల్ చేస్తారట.

యేమైతేనేం, మాకు ప్రతీ పేపరు ఒకరోజు ముందుగానే తెలిసి పోయేది. ప్రతిరోజు అద్భుతంగా పరీక్షల్ని రాసేశాము; లెక్కల పరీక్షల రోజు మా లెక్కలన్నీ రైటయ్యాయి!

రెండుమూడురోజుల తర్వాత ఒక గమ్మత్తు జరిగింది. మాకేతెలుసు ననుకున్న క్వశ్చన్ పేపర్ ఆ టౌన్లో అందరికీ తెలిసిపోయింది. క్వశ్చన్ పేపరును సైక్లోస్టయిల్ చేసి బజారులో రూపాయకు, అర్ధకు అమ్మారు. ఆ రాత్రి రామచంద్రయ్య మా ట్యూషన్ వాళ్ళందర్నీ కలసినప్పుడు ఆయన ముఖం కందగడ్డలా ఉంది. కోపంతో వణికిపోతున్నాడాయన.

"వెధవల్లారా! మీలో ఎవరో మోసం చేశారు. క్వశ్చన్స్ ఇంకెవ డికో చెప్పాడు. ఎవడ్రా వాడు లేచి నిల్చోండి. చంపేస్తాను...."

ఎవరూ మాట్లాడలేదు. అందరి గుండెలు అతి వేగంగా కొట్టు కుంటున్నాయి. ప్రతివాడూ పక్కవాడిని "నువ్వా?" "నువ్వా" అన్న ట్టుగా చూస్తున్నాడు. కొన్ని క్షణాలు గడిచాయి.

"మిమ్మల్నేదో ఉద్దరిద్దామని, మిమ్మల్నేదో బాగుచేద్దామని మీకా క్వశ్చన్స్ చెపితే నా కాళ్లకిందకే నీళ్లు తెస్తార్రా! ఛీ! మిమ్మల్ని ఏం చేసినా పాపంలేదు. పొండి వెధవల్లారా!" అన్నాడు రామచంద్రయ్య.

అందరమూ ఒకరి మొఖాలు ఒకరు చూసుకుంటూ అక్కణ్ణించి వెళ్ళిపోయాము.

పరీక్షలయి పోయాయి. నేను బాగారాశాను. రామచంద్రయ్యగారు నాపట్ల ప్రత్యేక శ్రద్ధ చూపించారు.

క్వశ్చన్ పేపర్సు బయటికొచ్చాయి కాబట్టి ఈ పరీక్షలు కాన్సిల్ అయిపోతాయని మళ్లా పరీక్షలు పెడ్తారని ఒక పుకారు బయలుదేరింది. కాని త్వరలోనే ఆ పుకారు పుకారుమాత్రమేనని తేలిపోయింది. రామచంద్రయ్యగారే ఒకరోజు నవ్వుతూ చెప్పాడు.

"క్వశ్చన్ పేపర్సు ఎక్కడా బయటకురాలేదని అసెంబ్లీలో విద్యామంత్రిగారే స్వయంగా ప్రకటించాడు. అది కేవలం పత్రికలవాళ్లు ప్రభుత్వంమీద కావాలని వేసిన అభాండం మాత్రమే. కాబట్టి, పరీక్షల్ని మళ్లా పెట్టే సమస్య ఉత్పన్నం కాదు'' అన్నారాయన. కాబట్టి మీరిక మీ ఊళ్లకు వెళ్ళిపోయి హాయిగా సెలవుల్ని ఎంజాయ్ చెయ్యండి" అన్నాడు రామచంద్రయ్య.

## 7

వేసవి సెలవులు మా ఊరులో గడుపుతున్నాను.

ఒకరోజు మానాన్నగారికి రామచంద్రయ్య దగ్గరనుండి ఉత్తరం వచ్చింది. "మీతో కొన్ని ముఖ్యమైన విషయాలు మాట్లాడాలి. ఒకసారి మీరు పట్నం రండి!" అని రాశారు.మానాన్నకు రామచంద్రయ్య అంటే విపరీతమైన గౌరవం. వెంటనే బయలుదేరి వెళ్లారు. రెండుమూడురోజుల తర్వాత తిరిగొచ్చారు. ఆయనవచ్చాక నాకు పిడుగులాంటివార్త తెలిసింది. మా అమ్మచెప్పింది.(మా అమ్మ వట్టి పాతకాలపుమనిషి. వంటచెయ్యటం పెట్టడం తప్ప ఆమెకు బయటి ప్రపంచంతో సంబంధంలేదు.)

ఆ రాత్రి నాకు అన్నం పెడ్తూ "నీకు మంచి సంబంధం కుదుర్చుకొచ్చార్రా మీనాన్న" అంది మా అమ్మ.

"నాకు సంబంధమా? అంటే!" అన్నాను.

"పట్నంలో నీకు ట్యూషన్ చెప్పిన పంతులున్నాట్టకదా ఆయన, మూడో కూతుర్ని నీకిస్తారుట." అంది అమ్మ మురిసిపోతూ, నోట్లోపెట్టుకొన్న ముద్ద గొంతులో ఆగిపోయింది.

ఎలక్ట్రిక్‌షాక్ తిన్నవాడిలా వణికిపోయాడు. కాస్సేపు నా గొంతు పెగల్లేదు.

"ఏమిటి—ఏమిటి రామచంద్రయ్య కూతుర్ని నాకిస్తారా?" అన్నాను అతి కష్టంతో.

"ఔన్రా. ఆయన బాగా ఉన్నవాట్టగా నిన్ను వాళ్ళింట్లోనే ఉంచుకొని నువ్వు ఎందాక చదివితే అందాక చదివిస్తారట. నీకో మంచి ఉద్యోగంకూడా చూసిపెడ్తాడట. మీ నాన్న చాలా మురిసిపోతున్నారు. నువ్వు చాలా అదృష్టవంతుడి వట!

నా ముందున్న అన్నం పళ్లెం తీసి నేలకేసి కొట్టాను. దిగ్గునలేచి చెయ్యి మూతి కడుక్కొని బయటికొచ్చాను.

"ఏమిట్రా ? యేమైంది?" అంటూ అమ్మ నన్ను వెంబడించింది.

"ఆ గుడ్లగూబ మొహాన్ని నాకిస్తారా? జీవితాంతం వాడింటో నేను జైలు జీవితం గడపాలా? అంతకంటె చావు నయం!"

"అదేమిట్రా చిత్రంగా మాట్లాడతావు. మీ నాన్నగారేది చేసినా నీ బాగుకోసమే కదా. ఆయన మాటిచ్చి వచ్చారట. ఇప్పుడు నువ్వేమన్నా లాభంలేదు."

"హుం! మాటిచ్చి వచ్చారు నాతో ఒక్కమాటైనా చెప్పకుండానే" అన్నాను.

"నిన్ను అడిగి పెళ్ళి నిశ్చయిస్తారుట్రా. పసిపిల్లాడివి నీకేం తెలుసురా" అందామె.

"అబ్బబ్బబ్బ....నువ్వో పాతరాతి యుగం మనిషివి. నా ప్రాణానికి నువ్వోదానవు... నన్ను కాస్సేపు ఇలా వదిలేసి పో." విసుగ్గా అన్నాను. ఆమె లోపలకు వెళ్ళిపోయింది.

నా మనసంతా పాడైపోయింది.

నా కాళ్లు చేతులు కట్టేసి నన్నో ఉరికంభం ఎక్కిస్తున్నాట్టుగా ఫీలయ్యాను. ఇద్దరు కసాయివాళ్ళు కలిసి నా గొంతు కోసేస్తున్నారు. వాళ్ళ బారినుండి తప్పించుకొనే మార్గమే లేదా?

మా నాన్న సంగతి నాకు తెలుసు. ఆయన అనుకున్న పని మొండిగా చేసేస్తాడు.

ఆ రాత్రంతా నాకు నిద్రపట్టలేదు. పదేపదే వనజ నా కళ్ళల్లో మెదిలి కంపరమెత్తించింది. రామచంద్రయ్యను వాడి ఎలుగుబంటిమొహపు కూతుర్ని ఎలా నరికి పోగులు వెయ్యాలా అని ఆలోచించాను. నా బుర్రంతా వేడెక్కి పోయింది, జుట్టు పీక్కున్నాను. నాకు పిచ్చెత్తితే బావుండుననిపించింది. పదిహేడేళ్లు వస్తున్నా నన్నింకా పసిపిల్లాడికిందే జమకట్టే మా అమ్మ, నాన్నల తలలు పగలగొట్టే తప్ప నా బతుక్కి విముక్తి లేదనిపించింది.

తెల్లారేప్పటికి రామచంద్రయ్య సంబంధం నాకిష్టం లేదని మా నాన్నగారికి తెలిసినట్టుంది. నామీద గర్జించడం మొదలెట్టాడు.

"వేలెడులేవు. నాకంటే నీకే ఎక్కువ తెలుసు ననుకుంటున్నావురా. రామచంద్రయ్య లాంటి పెద్దవాడు, పేరున్నవాడు. డబ్బున్నవాడు పిలిచి పిల్లనిస్తానంటే ఎగిరి గంతేసేవిపోయి. వంకలు పెడ్తున్నాడు. వంకలు. మక్కెలిరగ తంతాను. యేమనుకున్నావో. రెండుమూడేళ్ళు బస్తీలో ఉండగానే పెద్ద మొనగాడివై పోయా ననుకుంటున్నావేమో, జాగ్రత్త చక్కగా ఆయనింట్లోనే వుండిచదువుకో. ఏదంటే అది చదివిస్తానన్నాడు. ఆయనకున్న ఇళ్లల్లో ఒక ఇల్లు నీపేర రిజిష్టర్ చేస్తానన్నాడు. బస్తీలో ఇల్లంటే ఏమనుకున్నావు. ఈ రోజుల్లో ఇరవై వేల ఖరీదైనా చేస్తుంది. నీ మొహానికి ఈ మాత్రం ఇచ్చేవాడెవడ్రా? పిచ్చి పిచ్చి వాగుడు వాగావంటే చంపేస్తాను ఖో" అన్నాడు.

ఆయనతో వాదించి లాభం లేదు. చేతికి ఏది దొరికితే అది అందుకొని వళ్లు చీరేస్తాడు.

నా కళ్ళకు నీళ్ళొచ్చాయి. కడుపునిండా ఏదో భయం, రోజంతా కాలుగాలిన పిల్లిలా తిరిగాను. ఇంటికొస్తే ఆ ఇంటిమీద విపరీతమైన ద్వేషం. ఆ ఇంటిని, ఇంట్లోవాళ్ళను పెట్రోలుపోసి తగులబెడ్తేగాని నా కసి తీరదు.

రోజంతా అన్నం తినలేదు.

అమ్మ బతిమాలింది. "ఆకలేస్తే వాడే తింటాడులే" అన్నారునాన్న

మా నాన్నకు నేను ఆయన అనుకున్నంత పనికిరాని వాడ్ని కావని రుజువు చెయ్యాలనిపించింది. కాని ఎలా?

రాత్రంతా తీవ్రంగా ఆలోచించాను. ఈ ప్రమాదం నుండి వెంటనే తప్పించుకోకపోతే, నా జీవితం శాశ్వతంగా నాశనం అవుతుందని నాకు తెలుసు.

అకస్మాత్తుగా నా బుర్రలో ఒక ఐడియా మెరిసింది.

ఈ ఇంట్లోంచి దూరంగా ఎక్కడికైనా పారిపోవాలి.

అప్పుడు మా నాన్నకు తగిన శాస్తి జరుగుతుంది.

ఆయనకు నేనొక్కడినే కొడుకును.

రెండు మూడు రోజులు కనిపించకుండా పోయానంటే నల్గురు నాలుగుమాటలంటారు. ఏడ్చి ఏడ్చి చస్తాడు.

మరుక్షణంలోనే వెంటనే పారిపోవాలన్న భావం నన్ను పూర్తిగా వశపరచుకుంది.

ఎక్కడికి వెళ్ళాలి? వెళ్ళినచోట తిండీ తిప్పలు?

సరిపోయేంత డబ్బుంటే ఎక్కడి కెళ్ళినా హాయిగా ఉండొచ్చు. మా నాన్న డబ్బెక్కడ దాస్తాడో నాకు తెలుసు.

నా గుండెల్లో రక్తం నిండుగా ప్రవహించింది.

ఏదో వెర్రి ఆవేశం నన్ను కుదిపివేసింది.

అప్పుడు అర్ధరాత్రి దాటి వుంటుంది.

ఇంట్లో అందరూ గాఢ నిద్రలో ఉన్నారు.

మా దాన్న డబ్బు ఒక పాత అల్మారాలో దాస్తాడు. దాని తాళపు చేతులు ఆయన మొలతాడుకు కట్టుకుంటాడు.

నెమ్మదిగా లేచాను. ఆయన గుర్రు కొడ్తూ నిద్రపోతున్నాడు. నా కాళ్లు వణికాయి. కాని నాలోని పట్టుదల సడల్లేదు, ఆయన బాగా కల్లుతాగి పడుకున్నాడు. ఆయన అంత సులభంగా లేవడని నాకు తెలుసు. నెమ్మదిగా ఆయన మొలత్రాడు కున్న తాళం చెవులు విప్పాను.

పిల్లిలా అడుగులో అడుగు వేసుకుంటూ అల్మారావున్న గదిలోకి వెళ్ళాను. తాళం తీశాను. చేతికందినంత డబ్బు తీసుకున్నాను. రెండు నోట్లకట్టలు చేతికందాయి. అవి జేబులో వేసుకున్నాను. అల్మారా అలాగే వదిలేసి నా బ్యాగ్‌కోసం వెతికాను. ఆ బ్యాగ్‌లో నావి రెండుజతలగుడ్డలు కుక్కాను. బయటి తలుపులు తీశాను. కిర్రుమని చప్పుడైంది. బయటి

కెళ్ళి మళ్ళీ తలుపులు దగ్గరగావేసి నడవసాగాను. మూడునాల్గు మైళ్లు నడిస్తే రోడ్డు వస్తుంది. రోడ్డువస్తే బస్సు వస్తుంది. బస్సులో పడ్డానంటే మా నాన్న పన్నిన ఉచ్చులోనుండి బయటపడ్డాను.

చకచకా నడుస్తున్నాను. అప్పుడు టైమెంతయిందో తెలియదు. అలా ఆ చీకట్లో ఒంటరిగా నడుస్తోంటే నాకేమీ భయం కలుగలేదు.

బస్సెక్కి మళ్ళా నేను చదువుకుంటున్న టౌన్‌కే వెళ్ళితే లాభం లేదు. అక్కడ రామచంద్రయ్య బోనుతెరుసుకొని తయారుగా వుంటాడు. అందుకని హైదరాబాదు వెళ్లాలని నిర్ణయించుకున్నాను.

ఊరుదాటి చాలా దూరం వచ్చేశాను.

మామిడి తోపుల్లో కోకిలలు అదేపనిగా కూస్తున్నాయి.

వాటితోపాటు నేనుకూడా "కూ" అని అరిచాను.

నా హృదయం వెర్రి ఆనందంతో ఉరకలు వెయ్య సాగింది. జైలునుండి పారిపోయి వస్తున్నాననిపించింది.

తూర్పు తెల్లగా తెల్లవారుతోంది.

సృష్టంతా మేలుకొంటోంది.

చెట్లమీది పక్షులు కిలకిల రావాలతో ఎక్కడికో స్వేచ్ఛగా ఎగిరి పోతున్నాయి.

లేత అరుణ కిరణాలతో సూర్యుడు స్వాగతం చెపుతున్నాడు.

ఆవు దూడలు అంబా అని అరుస్తూ గంతులు వేస్తున్నాయి. పశువులు కాసే కుర్రాళ్ళ జానపద గీతాలు శ్రావ్యంగా వినిపిస్తున్నాయి, చల్లగా వీస్తున్న పిల్లగాలికి చెట్ల కొమ్మలు మెల్లగా ఊగుతున్నాయి.

సృష్టిలో ఎక్కడ చూసినా స్వేచ్ఛ!

దూరంగా తెల్లగా మెలికలు తిరుగుతూ మెరిసిపోతూ తారురోడ్డు కనిపించింది.

ఎగిరి గంతేశాను.

ప్రపంచంలో నేను చూసిన వాటిల్లోకల్లా ఆ రోడ్డు అతి సుంద రంగా కనిపించింది

నే నింకేమైపోయినా ఫరవాలేదు.

నాకు స్వేచ్ఛ లభించింది.